# ఇప్పుడు నీరు తాగాల్సిన వే□ళయింది!

## గుర్తుచేసే మణికట్టు పట్టీ

## ఐఐటీ విద్యార్థుల ఆవిష్కరణ



దిల్లీ: రోజూ పనిలో పడి నీరు తాగడాన్ని మరచిపోవడం చాలామంది చేసే పొరపాటు. ఇలాంటి పొరపాటు చేయకుండా ఎప్పటికప్పుడు గుర్తుచేస్తూ, నీరు తాగించే సరికొత్త ఉపకరణాన్ని ఇద్దరు ఐఐటీ విద్యార్థులు రూపొందించారు. మణికట్టుకు పట్టీలా వేసుకొనే ఈ ఉపకరణం ఒంట్లోని నీటి నిల్వలపై ఓ కన్నేసి ఉంచుతూ, నీరు శాతం తగ్గగానే హెచ్చరిస్తుంది. 'హైడ్రో చెక్'గా పిలిచే ఈ పట్టీ సెన్సర్ల ద్వారా పల్స్‌రేట్‌ను, శరీర, పరిసర ఉష్ణోగ్రతను, బయోఎలక్ట్రికల్ ప్రభావాన్ని పర్యవేక్షిస్తుంది. ఈ పరామితులన్నీ శరీరంలో నీటి స్థాయుల్ని లెక్కించేవేనని ఐఐటీ గువాహాటి విద్యార్థి గీతిక సోంకే తెలిపారు. నీరు తాగడమనేది మన ప్రాధాన్యాంశాల్లోనే ఉండదని, కానీ దీనివల్ల డీహైడ్రేషన్ సమస్యవ స్తుందని,

శరీరంలో హైడ్రేషన్ నిల్వల్ని లెక్కించే ఈ తరహా ఉపకరణం ఇప్పటివరకు లేదని ఐఐటీ గోవా విద్యార్థి ప్రియాంక అరోడా పేర్కొన్నారు. ప్రస్తుతమున్న మొబైల్ అప్లికేషన్లు కేవలం హైడ్రేషన్ స్థాయిలను పరిశీలిస్తాయన్నారు. చెమటపై ఆధారపడి పనిచేసే మరో సాంకేతిక పరిజ్ఞానం చాలా ఖరీదైందన్నారు. తాజా పరిజ్ఞానం అల్గారిథం ఆధారంగా పనిచేస్తుంది. దీనిని వినియోగించే వ్యక్తి ఎక్కువసేపు వేడిగా ఉండే వాతావరణంలో ఉంటే ఆ మేరకు శరీరానికి అధికంగా అవసరమయ్యే నీటిని లెక్కిస్తుంది. వేడి వాతావరణంలోనే చాలాసేపు ఉంటూ, నీరు తాగిన ఆనవాళ్లు కనిపించకపోతే, నీరు తాగాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ఐఐటీ గాంధీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఉపకరణాన్ని ప్రదర్శించారు. పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

### సీసంతో కాలేయ సమస్య

మండి: కాలేయ సంబంధ సమస్య ‘ఫ్యాటీ లివర్ డిసీజ్’కు విషతుల్యమైన సీసానికి సంబంధం ఉన్నట్లు హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి ఐఐటీ పరిశోధకులు తొలిసారిగా గుర్తించారు. ఈ పరిశోధన ఫలితంగా కొత్త తరహా ఔషధాలు రూపొందించేందుకు మార్గం సుగమమైందని భావిస్తున్నారు. సీసం లవణాల్ని శరీరం గ్రహించి మృదుకణజాలంలో నిల్వ చేస్తోందని, కాలేయంలోనే 33 శాతం నిల్వ ఉంటోందని గుర్తించారు.